

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

# శ్రీ సాయి లీలామృతము



**అధ్యాయము - 19**

## ఉపదేశాలు III

### సమర్థ సద్గురువు

**భ**గవద్గీతలో శ్రీకృష్ణుడు యీ ముల్లోకాలలోనూ తాను పొందవలసినదేదీ లేదని, అయినా లోకానికి ఆదర్శంగా ధర్మం నెరవేరుస్తుంటాననీ చెప్పాడు. సిసలైన గురువుకూడ పూర్ణసిద్ధుడైనా సాధకునిలా స్వధర్మానికి చెందిన విధినిషేధాలు పాటిస్తూనే భక్తుల భావాలకు తగినట్లు వారితో వ్యవహరించి తగురీతిన సంస్కరిస్తాడు. ఈ అంశాలన్నీ సాయిబాబాలో చూడవచ్చు. అందుకే ఆయన సమర్థ సద్గురువు.

ఒక మారుమూల కుగ్రామంలో ఊరూ పేరూ లేని పిచ్చి ఫకీరుగా వెలసిన సాయిబాబాను ఎందరెందరు సాధువులు చూచి ప్రశంసించారో! అప్పా అనే కన్నడ సాధువు ఠాకూరును, తపోవనంలోని సాధువు బాలకృష్ణ ఉపాసనీ శాస్త్రిని, ఇమాంభాయి ఛోటేఖాన్‌ను దర్వేష్‌షా అను ముస్లిం మహనీయుడు, అబ్దుల్లాను గురువైన అమీరుద్దీన్ ఫకీరూ, సాయి దర్శనానికి పంపారు. అంతేగాక, ఉపాస్య దైవమైన శ్రీమన్నారాయణుడు తన ఉపాసకుడైన రేగేను, సప్తశృంగిదేవి తన పూజారినీ గూడ దేవాధిదేవుడు, మునిజన వంద్యుడూ అయిన సాయి సద్గురుని దర్శన సేవలకు పంపారు. తులజాపూర్‌లోని భవానీదేవి, తర్వాత చండలేశ్వరీదేవి గూడ నరహరిశర్మ అనే భక్తుణ్ణి శ్రీ నృసింహ సరస్వతీ స్వామిని ఆశ్రయించమనడం "శ్రీ గురు చరిత్ర"లో చూడవచ్చు. శివకేశవులను శ్రద్ధగా ఉపాసిస్తే ఆ దేవతలు సద్గురువును చూపుతారని, సద్గురుకృప కలిగినపుడు శివకేశవుల కృప అదే కలుగుతుందని 'శ్రీగురు చరిత్ర' చెబుతుంది. దేవతలకంటె సద్గురువధికుడన్నది నిశ్చయం. హిందువులలో రేగేకు, బాలాభాటేకు, ముస్లింలలో షేక్ అబ్దుల్లా, అన్వర్‌ఖాన్ వంటి వారికీ ఉన్నతమైన ఆధ్యాత్మిక వికాసము మొదలుకొని, ఎందరెందరికో యెన్నోరీతుల శ్రేయస్సుననుగ్రహించారు సాయి. ఆయన ఆశ్రిత కల్పవృక్షము. నిజమైన భక్తితో ఎవరెక్కడ స్మరించినా సాయి వారివెంటనే వుండి రక్షిస్తారు.

జిజ్ఞాస, భక్తి విశ్వాసాలతోగాక అధికార మదము మొ॥న భావాలతో బాబాను దర్శించినవారున్నారు. ఒకరోజు 1910లో బాబా ఉగ్రులై, "నన్నొక దుష్టుడు చూడ్డానికి వస్తున్నాడు. సహజ మానవావయవాలు గల నన్ను చూచేదేమిటి?" అని కేకలేశారు. కొద్దిసేపట్లో రెవిన్యూ కమీషనర్ కర్టిస్, అతని భార్య, జిల్లాకలెక్టర్ మాక్స్వెల్ (ఆంగ్లేయులు) శిరిడీలో చావడికొచ్చారు. కమీషనర్ ఒక భక్తునితో, "పెద్ద ఉద్యోగులు దర్శనానికి వచ్చారు; సాయిని త్వరగా సిద్ధంగమ్మను!" అన్నాడు. సాయినలా యెవరూ ఆజ్ఞాపించలేరని ఆయన దయకోసం వేచి వుండవలసినదేననీ భక్తులు చెప్పారు. అరగంట తర్వాత బాబా, భిక్షకు బయల్దేరుతుంటే నమస్కరించి, "మహరాజ్! మీతో మాట్లాడాలి" అన్నది శ్రీమతి కర్టిస్. ఆయన, "నేను భిక్షకు వెళ్ళాలి; అరగంట ఆగు" అన్నారు గాని 10 ని॥లలోనే తిరిగి వచ్చారు. తమకోసమే సాయి త్వరగా వచ్చారని తలచి మరల ఆమె నమస్కరించింది. సాయి, "ఒక గంట ఆగు" అని చెప్పి మరల భిక్షకు వెళ్ళారు! అహం దెబ్బతిన్న ఆ దొరలు వెళ్ళిపోయారు. అధికారుల మెప్పుకోసం ప్రాకులాడడం సాధు సత్పురుషులకు నిషిద్ధమని ఆయన తెల్పారు.

మరోవంక ఆయన నిజమైన ప్రేమను గుర్తించి ఆదరించేవారు. సం॥ 1913లో శ్రీరామనవమికి ముందు నామసప్తాహం జరుగుతున్నది. ఎక్కడ చూచినా జనం కిటకిటలాడుతున్నారు. శ్యామాను పిలిచి సాయి "గోడవతల ఒక వృద్ధుడున్నాడు, తీసుకురా!" అన్నారు. చూస్తే అక్కడొక వృద్ధుడున్నాడు. అతని నోట చొంగ కారి, ఈగలు ముసురుతున్నాయి. అతడిని మశీదులోకి తీసుకురాగానే, బాబా అతని మూటలోని కలకండ తీసుకొని కొంచెం తిని మిగిలినది అతనికిచ్చి, అతని తలపై చెయ్యి పెట్టి ఆశీర్వదించారు. అలానే మశీదు ముంగిట ఎప్పుడూ ఒక కుక్కవుండేది. సాయి దానికి రొట్టెలు పెట్టేవారు. ఒకరోజు దానిని మాధవ్‌ఫస్లే, "ఛీ, ఫో!" అని తన్నాడు. సాయి అతనిని "అది నాకోసమొచ్చింది గాని నీకోసం గాదు. దానినేమీ చేయవద్దు!" అని తీవ్రంగా మందలించారు.

ఒక ధనికుడు, తనకు భగవంతుడన్నీ యిచ్చాడని, బ్రహ్మజ్ఞానమొక్కటి లభిస్తే తన జీవితం సంపూర్ణమవుతుందనీ తలచి శిరిడీ వచ్చాడు. "బాబా, మీరు ముముక్షువులకు తక్షణమే బ్రహ్మజ్ఞానమిస్తారని విని వ్యయప్రయాసల కోర్చివచ్చాను" అన్నాడు. సాయి నవ్వి, "నావద్దకందరూ కోరికలతో వచ్చేవారే; బ్రహ్మజ్ఞానం కోరేవాడు దొరకడమే నా అదృష్టం!" అన్నారు. అతడు పొంగిపోయాడు. సాయి అతనితో మాట్లాడుతూనే తమకు అప్పుగా రూ. 5/- లు తెమ్మని బాలావంటి వర్తకుల వద్దకు పంపుతున్నారు. ప్రతిసారీ అతడొచ్చి ఆ వర్తకుడు లేడనో, అప్పు దొరకలేదనో చెబుతున్నాడు. అదంతా చూస్తూ కూడా ఆ ధనికుడు పైసాగూడ రాల్చకుండా, "బాబా, నేను వెళ్ళాలి, త్వరగా జ్ఞానం ప్రసాదించండి" అన్నాడు. సాయి, "నా యత్నమంతా అదే! కాని నేనేమి చేసేది? జ్ఞానం కావాలంటే (1) పంచప్రాణాలు, (2) జ్ఞానేంద్రియాలు, (3) మనస్సు, (4) బుద్ధి, (5) అహంకారం -- యీ ఐదింటినీ భగవంతునికర్పించాలి. అదెంతో కష్టం. నీవద్ద నాకవసరమైన దానికి యాభై రెట్లున్నా ఫకీరుగా నాకు అర్హత లేదు కాబట్టి అప్పు లభించదు. డబ్బే నీ పాలిట బ్రహ్మం. దానిపై మోహం నశిస్తేగాని జ్ఞానం కలుగదు" అన్నారు. అంటే బాబావద్ద జ్ఞానమెంత వున్నా అర్హతలేని అతడికది లభించలేదు. ఏసుగూడ యిటువంటి శ్రీమంతునితోనే, "సూది బెజ్జంలోంచి ఒంటెైనా పోగలదేమో గాని, స్వర్గ ద్వారంలోనికి ధనికుడు మాత్రం పోలేడ"ని చెప్పారు. వాచా ఆత్మజ్ఞానం కోరినా లభించదు. డబ్బుపై ప్రీతి మనిషి ప్రవర్తననంతటినీ మలచినట్లు ముముక్షుత్వం మలచినపుడే అది వాస్తవమవుతుంది; జ్ఞానం లభిస్తుంది.

ఫిబ్రవరి 15, 1915న హార్దాలో సాధూభయ్యా తన స్నేహితులతో కలసి నడుస్తూండగా సాయి అతడికెదురుగా వచ్చి, అతడి చేతిలో పళ్ళు కుట్లుకునే వెండి పుల్ల వుంచి అదృశ్యులయ్యారు. మిత్రుడామాట శంకించి, శ్యామాకు జాబు వ్రాశాడు. సరిగా ఆనాడదే సమయానికి ఆ విషయం శిరిడీలో సాయి భక్తులతో చెప్పారని జాబొచ్చింది. తర్వాత సాధు భయ్యా శిరిడీ వచ్చినపుడు అతని అనుభవం బడేబాబాకు చెప్పమన్నారు. అది విని బడేబాబా ఏడుస్తూ సాయితో, "మీరు నాకు డబ్బిస్తారు గాని, అతనికి సాక్షాత్కారమే యిచ్చారే!" అన్నాడు. సాయి నవ్వి, "ఏం చేస్తాం? ఎవరు కోరింది వాళ్ళు పొందుతారు!" అన్నారు.

నిత్యజీవితంలో ధనంకోసం ప్రాకులాడుతూ, ఆలయానికి వచ్చినపుడు మాత్రం మోక్షం కోరడం ఆత్మవంచనే. ఒకడు సాయినలానే కోరాడు. సాయి వెంటనే ఒక పిల్లవాణ్ణి ఏ వర్తకునినుండైనా రూ. 100/- లు అప్పుగా తెమ్మన్నారు. వాళ్ళు తమ వద్ద డబ్బులేదని చెప్పి, అందుకు బదులు తమ నమస్కారాలర్పించారు. నానాసాహెబ్‌ను పిలిపించి అతనిని పైకమడిగారు బాబా. అతడు చీటి వ్రాసి పంపగానే వర్తకుడు రూ. 100/-లు అప్పుగా పంపాడు. సాయి మొదట ప్రశ్నించిన భక్తునితో, "అంతా యిలాగే వుంటుంది. అర్హత కలవారికే భగవద్దర్శనమవుతుంది - ఉద్యోగి, సంపాదకుడూ అయిన సంసారికి మాత్రమే అప్పు పుట్టినట్లు!" అన్నారు.

సాయివంటి సద్గురువుమీద ప్రీతి పెరిగిన కొద్దీ భక్తులకు ధనంపై ప్రీతి తగ్గుతుంది. సాయిగూడ వారినారీతినే

అనుగ్రహిస్తారు. శ్యామా ఒకనాడు, "బాబా. నీవెందరికో సిరిసంపదలిచ్చావు. నాకివ్వలేదేమి? నీవుగూడ చింకి గుడ్డలేసుకొని పాత మశీదులో గోనెమీద నిద్రిస్తావు. పీనాసివి. తిండిగూడ ఇతరులను అడుక్కుంటావు. నిన్నందరూ దేవుడంటారు. నిజానికి నిన్నొక దేవుణ్ణి చేసింది మేమే. మేము కాదంటే అడిగేదెవరు?" అన్నారు. సాయి ఎంతో ప్రేమగా, "సిరిసంపదలు నీకు తగవు. నీకివ్వవలసినది వేరు" అన్నారు. ఒకసారి సింధీ వర్తకుడొకడు శ్యామాకు బంగారు నాణాలు సమర్పించబోతే, సాయి అతనిని కఠినంగా వారించారు! అతనికివ్వదలచినదేమో సాయి తమ చర్యలలో సూచిస్తున్నారు.

శిరిడీలో ఒక రామదాసి రోజూ స్నానం చేసి మశీదులో విష్ణుసహస్ర నామపారాయణ చేసేవాడు. బాబా ఒకరోజు తమకు కడుపునొప్పిగా వుందని, బజారునుండి 'సోనాముఖి' అనే మూలిక తెమ్మనీ అతనిని పంపారు. అతడు వెళ్ళగానే, బాబా అతని విష్ణు సహస్రనామం పుస్తకం శ్యామాకిచ్చి, "ఇదెంతో శక్తివంతమైనది. ఒకప్పుడు నాకు గుండెదడ వచ్చి, మరణం తప్పదనిపించింది. అపుడు దీనిని హృదయానికి హత్తుకోగానే, భగవంతుడే దిగివచ్చి వ్యాధి తగ్గించినట్లనిపించింది. ఇది తీసుకొని రోజుకొక్క నామమైనా భావయుక్తంగా నెమ్మదిగా చదువు. ఎంతో మేలు చేస్తుంది" అన్నారు. ఆయన వినోదంగా తనకూ, రామదాసికీ తగవు పెడుతున్నారని తలచి, "ఈ రామదాసి ముక్కోపి. ఈ పుస్తకం నేనే దొంగిలించానని తలచి పోట్లాడుతాడు. నాకొద్దు, నేను సంస్కృతం చదవలేను గూడ!" అన్నాడు శ్యామా. కాని సాయి పట్టుబట్టడంతో తీసుకున్నాడు. రామదాసి రాగానే, భక్తుడు అన్నా చించనీకర్, సాయికి వినోదం కల్పించాలని, "నీ పుస్తకం శ్యామా వద్దనున్నదేమిటి?" అన్నాడు. రామదాసి ఉగ్రుడై ఆ పుస్తకం దొంగిలించడానికే అతడు బాబాతోచెప్పి తనను బజారుకు పంపాడని నిందించి, పుస్తకమివ్వకుంటే తల పగుల కొట్టుకుని చస్తానన్నాడు. ఒకవంక శ్యామాకు హితం చేస్తూనే, రామదాసినిగూడ సంస్కరించారు బాబా. బాబా, "నీవు రామభక్తుడవైనా, ఈ గ్రంథ పారాయణ చేస్తున్నా, నీ మనస్సు పవిత్రం అవలేదేమిటి? అది నీకిది వరకే కంఠస్థమైంది గదా? ఇక అది నీకెందుకు? శ్యామా మనవాడే గదా! నేనే అతడికా పుస్తకమిచ్చాను. దానిపై వ్యామోహమే ఇంత కోపానికి కారణం. ప్రశాంతంగా ఆలోచించు. డబ్బు పారేస్తే పుస్తకాలు దొరుకుతాయి! మనుషులలా గాదు. ఇంతా చేస్తే ఆ పుస్తకం వెల ఎంత?" అన్నారు. ఈ సంఘటన ద్వారా ఎవరికేది అవసరమో అది వారికి ప్రసాదించారు సాయి. శ్యామాకు పవిత్ర గ్రంథం, రామదాసికి వివేకం.

భక్తుని హృదయంలో తమపై ప్రీతివున్నా, పచ్చి లౌకికుల దుస్సాంగత్యంలో జీవించక తప్పనివారిని సత్సాంగత్యంలోకి లాగుతారు బాబా. దాసగణు యిలా చెప్పాడు: "నేను పోలీసు శాఖలో పని చేస్తుండగా, నానా చందోర్కర్‌తో కలిసి సాయిని సందర్శించాను. సాయి నానాతో, 'ఇతడికి తమాషాలన్నా, ఉద్యోగమన్నా వ్యామోహ మెక్కువ. అవి వదలమను' అన్నారు. అంతటితో నేను తమాషా (వీధి నాటకాలు) లలో పాల్గొనడం మానేశాను గాని, ఉద్యోగం వదలలేక పోయాను. ఆయనెప్పుడు ఆ మాట చెప్పినా, 'చూస్తాను' అనేవాణ్ణి. బాబా యిలా పదేళ్ళు చెప్పి చెప్పి, చివరికి, 'వీణ్ణి కొరత వేస్తేగాని ఉద్యోగం మానడు!' అన్నారు. తర్వాత ఒకసారి మరో ముగ్గురు పోలీసులతో పాటు నన్ను కాణాభిల్ అనే పేరుమోసిన బందిపోటుపై నిఘా వుంచారు. అతడు కనిపెట్టి ఆ ముగ్గుర్నీ చంపేశాడు. నేను భయంతో శ్రీరాముని ప్రార్థించాను. కాణాభిల్ నన్ను బెదిరించి విడిచిపెట్టాడు. తర్వాత అతడొక కొండప్రాంతంలో తిరుగుతూంటే అధికారులకు తెల్పాను. పోలీసులు అన్నివైపుల నుండీ దాడి చేశారు. చాలామంది పోలీసులు గూడ మరణించారు. అతడు మాత్రం తప్పించుకున్నాడు. ఇక నాకు ధైర్యం చాలక సెలవుకై ఒక దొంగ డాక్టరు సర్టిఫికేట్ దాఖలు చేసి, శెలవు మంజూరు గాకముందే నా స్థానం విడిచి యాత్ర చేశాను. అందుకు వుద్యోగంలో యిబ్బంది రాకుంటే ఈసారి వుద్యోగం విడుస్తానని గోదావరిలో నిలబడి సాయికి మ్రొక్కుకున్నాను. అక్కడొక దొంగలముఠా కన్పించడంతో నా ప్రయాణానికి సాకు దొరికింది. ఇంతలో ప్రమోషన్

పరీక్షగూడ పాసయ్యాను. అయినా నాకు ప్రమోషన్ రాదన్నారు బాబా. తర్వాత నాకు బదిలీ అయిన చోటికి శిరిడీ మీదుగా వెళుతూ బాబాకు కన్పించవలసి వస్తుందేమోనని మసీదు వైపుకు తిరగకుండా తిన్నగా పోతున్నాను. కానీ సరిగ్గా లెండీ దగ్గర బాబా ఎదురయ్యారు. గుఱ్ఱం దిగి నమస్కరించాను. 'గణూ, గోదావరీ జలం చేతబట్టి ప్రమాణం చేసినదెవరు?' అన్నారు. 'అలాగే చేస్తానుగదా!' అన్నాను. 'సరే వుండు, ఇలా చెబితే వినవులే!' అన్నారు బాబా. కొద్దికాలమైంది. ఒక నేరస్తుని నుండి వసూలు చేసిన జరిమానా పైకం నా సాటి పోలీసు కాజేసాడు. నాకు శిక్ష తప్పదు. ఈసారి శిక్ష తప్పితే తప్పక వుద్యోగం విడుస్తానని మ్రొక్కుకొని, శిక్ష తప్పగానే 1903లో రాజీనామా చేశాను. బాబా ఆ విషయం ప్రస్తావించినప్పుడల్లా, 'నీవు నాందేడులో వుండు' అనేవారు. 'నాకు భుక్తెలా?' అంటే, 'నేను పోషిస్తాను!' అనేవారు. కనుక నేను నాందేడులో స్థిరపడ్డాను. మొదట కీర్తనలే నాకు జీవనమయ్యాయి. తర్వాతొక భక్తుడు తక్కువ ధరకిచ్చిన పొలమే నాకు జీవనాధారమైంది."

సాయి విశ్వాసంలేని వారిని గూడ కష్టాలలో రక్షించి, భక్తిని ప్రసాదించి తర్వాత తమ సేవలోనే భుక్తి, ముక్తి ప్రసాదిస్తారు. ఆ తర్వాత దశ మహల్సాపతిలో చూస్తాము. అతడు బంగారుపని, తరతరాలుగా వంశాచారంగా వస్తున్న 'ఖండోబా' ఆలయంలో అర్చకత్వము చేసేవాడు. సాయి అతనిచేత బంగారు పని మాన్పించి అర్చకత్వము, భిక్ష చేయించారు. ఇంకా తర్వాత దశ ఉపాసనీ బాబా, అన్వర్‌ఖాన్ వంటి వారి జీవితాలలో చూడవచ్చు. ఇలా క్రమపద్ధతిన సాయి తన సద్భక్తుని ఉద్ధరిస్తారని తోస్తుంది. అయితే ఎక్కువ మందికి అంత స్థిరమైన మనస్సుండదు కనుక సాయివంటి సద్గురుసేవ దొరికినా కొంతకాలమయ్యాక దానిని విడచి, ఆయనపట్ల శ్రద్ధ కోల్పోతారు. ఆ విషయమే మామిడి పూతను ఉదాహరణగా చెప్పారు సాయి.

అయితే పరిపాకం రాకుండానే తనకై తానే యిల్లు, వాకిలి విడచిన హరిభావుఫన్సేను ఆయన మరలా యిల్లు చేర్చారు. పరిపాకం లేకుండా సన్యసించి భ్రష్టుడు కాబోయిన విజయానందునెలా మందలించి రక్షించినదీ చూచాము. సద్గురువు ఎవరినీ, వారి శక్తికి మించి ఆత్మపథంలోకి లాగజూడరు. అనివార్యంగా అనుభవించవలసిన కర్మఫలాన్ని సాధనంగా చేసుకొని వాళ్ళ పరిపాకాన్ని పెంచుతారు. అవసరమైతే దానినే తమ మందలింపుగా వినియోగిస్తారు. ఒక ఉదాహరణలో ప్రధానమైన ఆధ్యాత్మ జీవిత సూత్రాలన్నీ సాయి తెల్పారు. పూనాలో 1914లో ప్లేగు చెలరేగింది. దూబే అను భక్తుడు భయంతో శిరిడీ వస్తానని మ్రొక్కుకున్నాడు. కానీ తర్వాత మనసు మార్చుకొని సకుటుంబంగా 'సాసర్‌వాడ' వెళ్ళాడు. అక్కడ అతని పసిబిడ్డ ఆ వ్యాధితోనే మరణించింది. అతని భార్యగూడ తీవ్రంగా జబ్బుపడింది. నాటి రాత్రి సాయి దూబేకు స్వప్నదర్శనమిచ్చి, "మానవుడు మొక్కులు చెల్లించి తీరాలి. లేకుంటే యిలా బాధలొస్తాయి" అని చెప్పి, అతని భార్యకు నుదుట విభూతి పెట్టారు. వెంటనే దూబే నిద్రలేచి, తన భార్య నుదుట విభూతి చూచి ఆశ్చర్యపోయాడు.

★★★

★ ఆదివారం పారాయణ సమాప్తము ★